క్లుప్తంగా

మహిళకు ఆశ వర్కర్‌గా ఉపాధి



సూర్యకుమారికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, బాపూ ఆనంద్

అల్లిపురం : జీవీఎంసీ 31వ వార్డు కార్యకర్త, ఎస్సీ మహిళ సూర్యకుమారికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ సహకారంతో అమ్మవారివీధి ఆశ వర్కర్‌గా ఉపాధి కల్పించారు. ఈ మేరకు బుధవారం ఆశీలమెట్ట దరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వాసుపల్లి చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యకుమారి ఎమ్మెల్యే వాసుపల్లికి, బాపూ ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం



స్వర్ణ జయంత్యుత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

దాబాగార్డెన్స్ : ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ డివిజన్ ఏర్పడి బుధవారం నాటికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డివిజినల్ కార్యాలయం ఆవరణలో యూనియన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు మల్లాది కామేశ్వరి, కార్యదర్శి వరప్రసాదరావు మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా కార్మిక సంక్షేమానికి, సభ్యుల అభ్యున్నతికి పని చేస్తున్నట్లు తెలిపారు. 1974 అక్టోబర్ 18న మచిలీపట్నం డివిజన్ నుంచి విశాఖపట్నం డివిజన్ ఏర్పడిందన్నారు. 74లో ప్రెసిడెంట్‌గా పని చేసిన రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యుడు ఎస్. కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్థ ఉన్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా స్వర్ణ జయంత్యుత్సవ లోగో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్మప్రచార వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

దాబాగార్డెన్స్ : టౌన్‌కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథస్వామి దేవాలయంలో ఈ నెల 22 నుంచి 28 వరకు నిర్వహించనున్న 'ధర్మప్రచార వారోత్సవాల'పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మారోజు శ్రీనివాస్, ధర్మకర్తలు కంటుముచ్చు సాగర్, సూరిని రాము, కంచర్ల రవి (బుల్లెట్ రవి), ధనాల రాంబాబు, ఎక్స్ అఫిషియో సభ్యుడు జగన్నాథాచార్యులు, పార్టీ నాయకుడు దోశమంతుల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లఘుచిత్రాల ప్రదర్శన

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న దసరా లఘుచిత్రాల ప్రదర్శన బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ దేశ విదేశాల్లో అవార్డులు పొందిన లఘు చిత్రాలను రెండు రోజుల పాటు ప్రదర్శించామన్నారు. ఇండియాతోపాటు బంగ్లాదేశ్, నేపాల్, కొరియా, ఇరాన్ తదితర దేశాలకు చెందిన లఘుచిత్రాలు ప్రదర్శించినట్లు తెలిపారు. వీటిలో ఎక్కువ మానవ సంబంధాలు, మానవ విలువలు, సామాజిక బాధ్యత అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, శ్రీమన్నారాయణ, సుధాకర్, అపర్ణ, మూర్తి, ఉషారాణి పాల్గొన్నారు.

జయశుభకారిణి.. విజయ రూపిణి



భువనేశ్వరీదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ



మహాలక్ష్మి అవతారంలో వివేకానందకాలనీ సాయిబాబా ఆలయంలోని అనఘాలక్ష్మి



కరెన్సీ నోట్ల అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

అన్నపూర్ణాదేవిగా దుర్గాలమ్మ అమ్మవారు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ జంక్షన్‌లో గల శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల నాలుగో రోజైన బుధవారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో పి.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు సకల సదుపాయాలు కల్పించారు. దేవస్థానం అర్చకులు అమర్‌నాథ్, కృష్ణ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానం పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బత్తి మంగరాజు, ధర్మకర్తలు డి.లక్ష్మీనారాయణ, కె.వరలక్ష్మి, వెంకటలక్ష్మి, రమణమ్మ, డి.వేణుగోపాల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు మహా అన్నదానం..

జీవీఎంసీ 35వ వార్డు పరిధిలోని రామకృష్ణా జంక్షన్‌లో ప్రముఖ వ్యాపారి చిల్లా రామిరెడ్డి ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల నాలుగోరోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అంతకు ముందు ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, భక్తులు పాల్గొన్నారు.

భువనేశ్వరీదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ..

అల్లిపురం : యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ భువనేశ్వరీదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

మహాలక్ష్మీ అమ్మవారుగా అనఘాదేవి..

అల్లిపురంలోని వివేకానందకాలనీలో వెలసిన సాయిబాబా దేవాలయంలో కొలువై వున్న అనఘాదేవి అమ్మవారు బుధవారం మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు మణిద్వీప పూజా కార్యక్రమం ఆలయ అర్చకుడు పవన్‌శర్మ పర్యవేక్షణలో నిర్వహించారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో ఎర్నిమాంబ

కంచరపాలెం : జ్ఞానాపురంలో వేంచేసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, ఆలయ సిబ్బంది ప్రసాద్, అప్పలరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

దాబాగార్డెన్స్ : దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం పలు అసోసియేషన్లకు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. 33వ వార్డు కుమ్మరవీధిలో లక్ష్మీ గణపతి యూత్ అసోసియేషన్ నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలకు రూ.10వేలు, 27వ వార్డు దొండపర్తి పాలికల వీధిలో సంపత్ వినాయక అసోసియేషన్ నిర్వహిస్తున్న ఉత్సవాలకు రూ.5 వేలు, భగత్‌సింగ్ కాలనీలో శ్రీసాయి విఘ్నేశ్వర దుర్గా భవానీ సేవా సమితి దుర్గాదేవి ఉత్సవాలకు రూ.5 వేలు అందజేశారు.

రాజరాజేశ్వరీదేవిగా కన్యకాపరమేశ్వరి

కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు బుధవారం రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మచే సామూహిక దిశ గౌరీ పూజ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్తి విజయగౌరీచే భక్తి సంగీతం, సాయి భారతి కూచిపూడి అకాడమీచే కూచిపూడి, కీర్తనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు అరుణ్‌కుమార్, దోమా వెంకట సతీష్‌కుమార్, కంకటాల సతీష్, దుర్గా నూకేశ్వరరావు, దేవస్థానం మహిళా విభాగం సభ్యులు కట్టమూరి ప్రసన్న, కుంచం సత్యవతి, పి. సుజాత, శైలజ తదితరులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న మహిళలు



రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి



35వ వార్డులో దుర్గాదేవికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులైన అల్లిపురంలోని మిరపకాయలవీధికి చెందిన పలువురు కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం వారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గత 16 సంవత్సరాలుగా టీడీపీలో ఉన్న సబ్బిటి ఆదినారాయణ, రావు, చంటి, మోహన్, హుస్సేన్, అబ్దుల్, రాము, బంగారమ్మ, బండారు సావిత్రి, చిత్ర సుజాత, లక్ష్మి, జాగారపు వరలక్ష్మి, చిన్న పార్వతి తదితరులు ఉన్నారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. 2024లో మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు కష్టపడతాం అన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని వారికి పిలుపునిచ్చారు. 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ముత్తాబత్తుల రమేష్, పచ్చిరిపల్లి రాము, బొర్రా శ్రీనివాసరెడ్డి, వలిశెట్టి లక్ష్మి, రామరాజు, 34వ వార్డు నాయకులు దూడ అప్పారావు, గద్దిపల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పాలక మండలిలో స్థానం.. పూర్వజన్మ సుకృతం

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- ఘనంగా ఎరుకుమాంబ అమ్మవారి నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆలయ ఈవో

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరయ్యారు. కొత్త పాలక మండలితో ఆలయ ఈవో రమాబాయి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ ఆలయాభివృద్ధికి నూతన పాలక మండలి కృషి చేయాలన్నారు. పాలక మండలిలో స్థానం సాధించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావించాలన్నారు. ఆలయ అధికారులు, స్థానికులతో కలిసి ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికైన నీలాపు సర్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ అమ్మవారి సేవ చేసుకునే భాగ్యం కల్పించిన ఎమ్మెల్యే గణేష్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరల గణేష్‌కుమార్‌ను, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని రుణం తీర్చుకుంటామన్నారు. సభ్యులుగా కె.బ్రహ్మాజీ, పిల్లిస్వాతి, పిల్లిదుర్గ, దళాయి అన్నపూర్ణ, శరగడ నరసింగరావు, బంటుపల్లి సూర్యనారాయణ, పి.రమణమ్మ, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా గంగవరపు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ జాన్‌వెస్లీ, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, కోడూరి అప్పలరత్నం, రామాలయం, పరదేశమ్మ ఆలయాల చైర్మన్ సోమునాయుడు, నీలమ్మ వేపచెట్టు ఆలయ చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, మండల అధ్యక్షులు, నాయీ బ్రాహ్మణ ప్రెసిడెంట్ త్రినాథ అజయ్‌రెడ్డి, అనిల్, శివ, వార్డు అధ్యక్షులు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా బొమ్మల కొలువు..



ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

దాబాగార్డెన్స్ : దసరా సందర్భంగా నౌరోజీ రోడ్డులో స్థానికంగా నివసిస్తున్న జి. శాంతిరావు తమ ఇంట్లో 12వ సారి ఆకర్షణీయంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ప్రకృతిలో భాగమైన మన జీవన విధానానికి అనుసంధానమైన విభిన్న అంశాలు, వివిధ రకాల బొమ్మలు, వాటితో పాటు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దేవతామూర్తులను బొమ్మల కొలువులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన భారతీయ సనాతన సంప్రదాయంలో భాగమైన, ముఖ్యంగా దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో దసరా సందర్భంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం ద్వారా మన సాంప్రదాయ విలువలకు ప్రాధాన్యత ఇచ్చినట్టు అవుతుందన్నారు. నేటి తరానికి బొమ్మల కొలువు ప్రాముఖ్యత తెలియజేసేందుకు ఈ ఆశ్వీయుజ మాసం దోహదపడతుందని చెప్పారు. ఏడాదికి ఒకసారి ఏర్పాటు చేసే ఈ బొమ్మల కొలువు వెనుక ఎంతో కృషి ఉందని, గత 11 ఏళ్లగా నిర్విరామంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం వెనుక భర్త ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణుడు జి. రాఘురామారావు ప్రోత్సాహం కూడా ఉందన్నారు. ఈ బొమ్మల కొలువు చూడడానికి వివిధ ప్రాంతాల నుంచి ఎంతో మంది మహిళలు వస్తుంటారని తెలిపారు. నిజ జీవితంలో ఎన్నో పండగలను ఆచరించే మనం, ఆశ్వీయుజ మాసంలో దేవీ నవరాత్రుల్లో బొమ్మలను కొలువు తీర్చి ప్రతి ఒక్కరూ అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని అభిలషించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ బొమ్మల కొలువును సందర్శించి శాంతిరావును ప్రశంసించారు.

సీఎంగా జగన్‌ను.. ఎమ్మెల్యేగా వాసుపల్లిని గెలిపించుకుంటాం



ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఫుట్‌పాత్ హాకర్స్

దాబాగార్డెన్స్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించుకుంటామని జగదాంబ, లేపాక్షి, టర్నర్‌చౌల్ట్రీ ప్రాంతాల ఫుట్‌పాత్ హాకర్స్ తెలిపారు. ఫుట్‌పాత్‌నే నమ్ముకొని గత 30 ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు (ఫుట్‌పాత్) మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ అప్పలరత్నం, పార్టీ నాయకులు సత్యనారాయణ, ఎర్రబిల్లి ప్రభాకర్, సనపల రవీంద్రభరత్, బోని దేవా, బొర్రా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే డెంగ్యూ నియంత్రణ



కేఆర్‌ఎం కాలనీలో సంప్‌ను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి తులసి

మద్దిలపాలెం : డెంగ్యూ నియంత్రణకు మహానగర పాలక సంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఇంటింట సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎం.తులసి ఆదేశించారు. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలో సర్వే చేస్తున్న సిబ్బంది పనితీరును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గృహాల్లోని ఫ్రిడ్జ్‌ల వెనుక నిల్వ నీరు తొలగించే ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. అలాంటి నీటిలోనే లార్వా పెరుగుతుందని, దోమలు ఉత్పత్తి చెందుతాయని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం జీవీఎంసీ, సచివాలయం, ఆరోగ్య సిబ్బంది నిర్వహించే డ్రై డే – ఫ్రై డే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ సాధ్యమవుతుందన్నారు. అనంతరం కాలనీలో ఇళ్ల పరిసరాలను, నిర్మాణంలో వున్న భవంతుల వద్ద సంప్‌లను పరిశీలించారు. సంప్‌లలో ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయిక్, ఆరోగ్య కార్యకర్తలు కె.ఎస్.శ్రీనివాసరెడ్డి, శేషుబాబు, ఎల్.శ్రీను, కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వ విధానాలు వెల్లడించండి

- ఆంధ్రాకు ఎందుకు జగనే కావాలంటే? కార్యక్రమంపై అవగాహన

అల్లిపురం : ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే? కార్యక్రమంపై వలంటీర్లు, పార్టీ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ప్రజల్లో అవగాహన కల్పించాలని నియోజకవర్గం 33,34,35,41 వార్డుల మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ తెలిపారు. 33వ వార్డు అన్ని సచివాలయాల వలంటీర్లతో వారు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వలంటీర్లకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. నవంబర్ 1వ తేదీ నుంచి నిర్వహించనున్న కార్యక్రమాల గురించి సచివాలయాల వారీగా వివరించారు. ప్రతి రోజు ఒక సచివాలయం పరిధిలో మధ్యాహ్నం 3 గంటలకు జెండా ఆవిష్కరణ నుంచి రాత్రి సచివాలయం పరిధిలో పెద్దలతో కలిసి సహపంక్తి భోజనాలు, మరుసటి రోజు ఉదయం ఇంటింటి ప్రచారం వరకు చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. జగన్.. చంద్రబాబుకు మధ్య గల తేడాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు మహిళా అధ్యక్షురాలు ఎల్లంకి చిన్నమ్మలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'రాజకీయాలు వ్యాపారమయం'



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

అల్లిపురం : దేశంలో రాజకీయాలు వ్యాపారమయం అయ్యాయని యుపీఎస్సీ మాజీ సభ్యులు ఆచార్య కేఎస్ చలం అభిప్రాయపడ్డారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సమంతా సాహితీ వేదిక, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆచార్య తెన్నేటి జయరాజ్ రచించిన ఓటు ఎవరికి వేయాలి? ఎందుకు వేయాలి? అనే పుస్తకాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కోట్లు ఖర్చుపెట్టి తిరిగి అంత కంటే పదిరెట్లు ఎక్కువ రాబట్టే లక్ష్యంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, డాక్టర్ జయరావు, మాజీ కార్పొరేటర్ కాట్రకన్నారావు, వేమన, వి.రాజేంద్రప్రసాద్, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు, అలమండ ప్రసాద్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ నిరసన

దాబాగార్డెన్స్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దమనకాండకు నిరసనగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు బుధవారం డాబాగార్డెన్స్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సిటు నాయకుడు జీఎస్ రాజేశ్వరరావు అక్కడ జరుగుతున్న అన్యాయంపై వివరించారు. బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఏఐబీడీపీఏ, సీసీడబ్ల్యూఎఫ్ తదితర యూనియన్ల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సాగర్, రామాంజనేయలు, పి. లచ్చిరాజు, సురేష్, బుడ్డి దొర, మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలి



చీరలు పరిశీలిస్తున్న మహిళలు

బీచ్‌రోడ్డు: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే చేనేత వస్త్రాలను ప్రజలు ఆదరించాలని మిసెస్ వైజాగ్ – 2023 సాక్షి బజాజ్ అన్నారు. బీచ్ రోడ్డులోని నోవాటిల్‌లో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులు నేటి యువతను ఆకర్షిస్తున్నాయన్నారు. చేనేత కార్మికుల కష్టానికి తగ్గ ఫలితం ఇచ్చేందుకు వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఈ నెల 22 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఇగ్నో ఆధ్వర్యంలో సాగరతీర స్వచ్ఛత



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ – స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం విశాఖ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఏయూ ఐఏఎస్‌ఈ కళాశాల విద్యార్థులతో కలిసి తీరంలో శుభ్రం చేసినట్లు కేంద్రం డైరెక్టర్ ధర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులు పలు చోట్ల చెత్త తొలగించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఇల్లు, కార్యాలయంతోపాటు అన్ని చోట్ల పరిశుభ్రత పాటించాలన్నారు. ఏయూ ఆచార్యులు, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.